క్లుప్తంగా

ఐదుగురు జూదరులు అరెస్టు

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లిలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ బ్రహ్మనాయుడు శుక్రవారం తెలిపారు. నిందితుల నుంచి 3,250 రూపాయలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

కళాశాలకు కుర్చీలు అందజేత



బహూకరించిన కుర్చీలతో విద్యార్థులు

అర్థవీడు: చదువుకున్న కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకరించడం అభినందనీయమని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాజర్ బాబు పేర్కొన్నారు. 2023–25 విద్యా సంవత్సరంలో కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులు శుక్రవారం 30 కుర్చీలు బహూకరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు బ్రహ్మేశ్వర్ రెడ్డి, నవజీవన్ రెడ్డి, పోలురాజు, గురవయ్య, షేక్షావలి, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు



జగదాంబ అమ్మవారు

మార్కాపురం టౌన్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో ఉన్న జగదాంబ అమ్మవారికి అర్చకులు కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చివరి శుక్రవారం కావడంతో మహిళా భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో..

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా మహిళలు సామూహిక వ్రతాలు ఆచరించారు. అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఈ సందర్భంగా ఉభయ దేవేరులతో కలిసి స్వామివారిని అర్చకులు అరుణ్‌కుమార్ ప్రత్యేకంగా అలంకరించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులు

గణేశ్ మండపాలకు అనుమతి తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్సై పి.కోటేశ్వరరావు

రాచర్ల: వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై పి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక విగ్రహం ఏర్పాటు చేసే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ముందస్తుగా అనుమతి తప్పనిసరిగా ఉండలన్నారు. మండపాల వద్ద గొడవలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కోరారు.

కంభం రైల్వే స్టేషన్‌లో గోవా మద్యం సీజ్



స్వాధీనం చేసుకున్న మద్యంతో గోవా పోలీసులు

కంభం: కంభం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున గోవా మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి రెండున్నర గంటల సమయంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ వ్యక్తి బ్యాగు వదిలేసి పారిపోయాడు. బ్యాగులో లభ్యమైన 12 గోవా మద్యం బాటిళ్లను పోలీసులు సీజ్ చేశారు. తనిఖీల్లో ఒంగోలు స్క్వాడ్ అధికారి నరహరి, కంభం ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీలకు బకాయి రూ.1.61 కోట్లు



- పాలన అద్భుతమంటూ బడాయి పోతున్న కూటమి ప్రభుత్వ పెద్దలు
- పంచాయతీలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు
- పల్లెల్లో అభివృద్ధి పనులు ఎక్కడివక్కడే నిలుపుదల
- ఏడాదిన్నర నుంచి బిల్లులు చెల్లించకుండా సర్పంచ్‌లకు వేధింపులు
- గ్రామాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించేందుకూ నిధుల కొరత

తర్లుపాడు:

కూటమి ప్రభుత్వ పాలనలో పంచాయతీ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. నిధుల లేమితో పంచాయతీలు కునారిల్లుతున్నా సర్కారు చోద్యం చూస్తోంది. కూటమి పాలనలో అద్భుతాలు చేస్తున్నట్లు బడాయిపోతున్న ప్రజాప్రతినిధులకు పంచాయతీలకు బకాయిలు చెల్లించేందుకు చేతులు రావడం లేదు. గ్రామాల అభివృద్ధి కోసం లక్షల రూపాయలు అప్పు చేసి పనులు చేసిన సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించకపోగా అధికారం మాటున వేధింపులకు దిగుతుండటం చర్చనీయాంశంగా మారింది. చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక ఆర్థికంగా చితికి పోతున్నామని సర్పంచ్‌లు మనోవేదనకు గురవుతున్నారు.

గతంలో పంచాయతీలు చేపట్టే పనులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిధులు వచ్చేవి. దీంతో పనులు చేస్తే ఢోకా ఉండదనే నమ్మకంతో సర్పంచ్‌లు అప్పులు చేసి మరీ పనులు చేశారు. సీసీ రోడ్లు, పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, డ్రైనేజీ, డీప్ బోర్లు, నీటి సరఫరా, చిల్లకంప తొలగింపు, వీధి దీపాల ఏర్పాటు కోసం రూ.లక్షలు వెచ్చించినా బిల్లులు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

అర్ధంతరంగా పనుల నిలిపివేత

గత ప్రభుత్వంలో నిర్మాణం చేపట్టిన గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, బల్క్ మిల్క్ సెంటర్ల పనులు కొన్ని అర్ధంతరంగా, మరికొన్ని చివరి దశలో నిలిచిపోయాయి. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల కోడ్ రాగానే నిలిచిన పనులు నేటికీ ప్రారంభించలేదు సరికదా వాటికి సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో పెట్టడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. నాడు–నేడు పనులను సైతం అర్ధంతరంగా నిలిపివేసిన కూటమి ప్రభుత్వం విద్యార్థులను సైతం ఇబ్బందుల్లోకి నెట్టింది.

పనులు చేయాలి.. కానీ పైసలివ్వరు!

తర్లుపాడు మండలంలోని 16 పంచాయతీల సర్పంచ్‌లకు రూ.1.61 కోట్లకు పైగా బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ప్రతి మంగళవారం వేట కోట్ల రూపాయల అప్పులు చేస్తున్న కూటమి సర్కారు పంచాయతీల్లో చేపట్టిన పనులకు బిల్లులు ఎందుకివ్వడం లేదో అంతుపట్టడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయకపోవడంతో పంచాయతీల్లో ఏ పనీ ముందుకు సాగడం లేదు. ఉపాధి హామీ పథకం బిల్లులు కూడా పెండింగ్‌లో పెట్టడంతో కూలీలు గగ్గోలు పెడుతున్నారు. పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సర్పంచ్‌లపై అధికారులు ఒత్తిడి చేస్తుండటంతో తమ ఆవేదనను వారి ఎదుటే వెళ్లగక్కుతున్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయ

తర్లుపాడు మండల బకాయిల వివరాలు

పంచాయతీ	బకాయిల మొత్తం(రూ.లో)
తర్లుపాడు	25 లక్షలు
నాగెళ్లముడుపు	25 లక్షలు
పోతలపాడు	19 లక్షలు
కలుజువ్వలపాడు	15 లక్షలు
మీర్జాపేట	14 లక్షలు
కేతగుడిపి	10 లక్షలు
తుమ్మలచెరువు	8 లక్షలు
గానుగపెంట	8 లక్షలు
సూరేపల్లి	6 లక్షలు
చెన్నారెడ్డిపల్లి	6 లక్షలు
సీతానాగులవరం	6 లక్షలు
తాడివారిపల్లి	5 లక్షలు
గొల్లపల్లి	5 లక్షలు
మంగళకుంట	3 లక్షలు
జగన్నాథపురం	2 లక్షలు
రాగసముద్రం	4 లక్షలు

అప్పుల్లో కూరుకుపోయాం



అధికారులు పనులు చేయాలంటున్నారు. చేసిన పనికి బిల్లులు చేస్తారా అంటే గ్యారంటీ చెప్పడంలేదు. ఇప్పటికే చేపట్టిన పనులకుగాను లక్షల రూపాయల బకాయి ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. నిధులు లేకపోవడంతో పనులు చేయలేకపోతున్నాం. రెండు విడతలుగా సర్పంచ్‌లకు రావాల్సిన నిధులను ప్రభుత్వం దారి మళ్లించింది. ఇప్పటికైనా తాము ఖర్చుచేసిన నిధులను మంజూరు చేసి పంచాయతీలను ఆదుకోవాలి.

– పెద్ద మస్తాన్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ కార్యదర్శి

పంచాయతీలపై చిన్నచూపు తగదు



గ్రామాల అభివృద్ధిలో ముందుండే తమకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేయడం సరికాదు. చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో అదనపు పనులు చేపట్టలేకపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నాం.

– జాన్ రత్నం, తాడివారిపల్లి సర్పంచ్

అప్పు చేసి వసతులు కల్పించాం



పంచాయతీల్లో ప్రజల సౌకర్యార్థం సొంత డబ్బు ఖర్చుపెట్టి మంచినీరు, పారిశుధ్యం, ఇతర పనులు చేపట్టాం. చేసిన పనులకు బిల్లులు పెట్టకపోగా అధికారులు వేధిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లయితే గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం.

– శ్రీనివాసరెడ్డి, పోతలపాడు సర్పంచ్

ప్రభుత్వం త్వరలోనే చెల్లిస్తుంది

పంచాయతీల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్న మాట వాస్తవం. ప్రభుత్వం త్వరలోనే బిల్లులు చెల్లిస్తుంది.

– ఎంపీడీఓ చంద్రశేఖర్

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు సూచనలిస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై నరసింహారావు సూచించారు. స్థానిక గౌతమి స్కూల్, జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సమాజంలో ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు అధికమయ్యాయని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీలు, ఖాతాల వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. చదువుకోవాల్సిన వయస్సులో విద్యార్థులు చెడువ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే వారు లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ కచ్చితంగా ధరించాలన్నారు. కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల కరస్పాండెంట్ చేగిరెడ్డి భూపాల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీడీఓ, ఎంపీపీ, జెడ్పీటీసీ

కొనకనమిట్ల: గ్రామ పంచాయతీల అభివృద్దే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు దృష్టి పెట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల పురోగతి 2.0 పై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి సారించాలన్నారు. క్లాప్ మిత్రల పనితీరును పర్యవేక్షించాలని కార్యదర్శులకు సూచించారు. సర్వేలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు మాట్లాడుతూ.. మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పలు సూచనలిచ్చారు. సమావేశంలో ఈఓఆర్డీ శ్రీదేవి, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి

రాచర్ల: గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి సూచించారు. ఎంపీపీ షేక్.ఖాశింబి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. మండల అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికను తయారు చేసుకుని దశలవారీగా సమస్యలు పరిష్కారించాలన్నారు. కార్యక్రమంలో రాచర్ల పశువైద్యాధికారి హరిబాబు, అకవీడు, పాలకవీడు సర్పంచులు తలపాటి దేవదానం, పల్నాటి లతీఫ్, ఈఓఆర్డీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం మూత



ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానిక తాళం వేసిన దృశ్యం (22జిడిఎల్ఆర్82)

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం శుక్రవారం మూతపడింది. ఈ కేంద్రంలో సీహెచ్‌ఓ, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఇద్దరు ఆశా కార్యకర్తలు విధులు నిర్వహించాల్సి ఉండగా తాళాలు వేసి ఉండటం గమనార్హం. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ఆరోగ్య ఉప కేంద్రాన్ని తెరిచి ఉంచి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వారానికి రెండు రోజులు మాత్రమే కేంద్రాన్ని తెరుస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రధాన రహదారి నుంచి ఆరోగ్య ఉప కేంద్రానికి చేరుకునే మార్గం, పరిసరాలు పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆరోగ్య ఉప కేంద్రం పరిసరాల్లో పిచ్చిమొక్కలు

'పట్టు'సాధిస్తే ఏడాదిలో ఐదు పంటలు



మాట్లాడుతున్న సుజయ్‌కుమార్

కొనకనమిట్ల: పట్టు పరుగుల పెంపకంతో అధిక ఆదాయం పొందవచ్చని జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి డాక్టర్ పి. సుజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టు పరిశ్రమ రైతులు ఏడాదిలో ఐదు పంటలు పండిచ్చవచ్చని చెప్పారు. కొనకనమిట్ల మండలంలోని మునగపాడు గ్రామంలో శుక్రవారం రైతులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గతంలో మునగపాడు, ముమ్మాయపాలెంలో పలువురు రైతులు రాయితీపై పట్టు సాగు చేసిన రైతులు తమకు బిల్లులు చెల్లించాల్సి ఉందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో సీఎస్ఆర్ ఎఫ్ఐటీ శాస్త్రవేత్తలు డాక్టర్ జాయిస్ రాణి, పురుసోత్తం, పట్టు పరిశ్రమ పొదిలి శాఖ టీఎంసీ పాండురంగస్వామి, మార్కాపురం ఏఎస్ఓ శ్రీధర్, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు బహుమతి



విద్యార్థికి బ్యాగ్ అందజేస్తున్న ఎంఈఓ

కంభం: టుబాకో ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ కార్యక్రమంలో భాగంగా పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలను వివరిస్తూ గత నెలలో సంతకాల సేకరణ చేపట్టిన విద్యార్థులకు శుక్రవారం బ్యాగులు పంపిణీ చేశారు. మండలంలోని మూడు క్లస్టర్ల పరిధిలో అత్యధిక సంతకాలు సేకరించిన విద్యార్థులను గుర్తించి ప్రభుత్వం, నేషనల్ టొబాకో కంట్రోల్ ప్రోగ్రాం, నేషనల్ హెల్త్ మిషన్ సంయుక్త ఆధ్వర్యంలో బ్యాగులు పంపిణీ చేసినట్లు ఎంఈఓ అబ్దుల్ సత్తార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరనారయణ, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సూరేపల్లి



గ్రామంలో వీధిలైట్లు లేక అలుముకున్న చీకటి

కంభం: మండలంలోని ఎల్‌కోట పంచాయతీ పరిధిలోని సూరేపల్లి గ్రామంలో గత 6 నెలల నుంచి వీధిలైట్లు వెలగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో, ఎస్సీ కాలనీలో రెండు మూడు చోట్ల మినహా లైట్లు వెలగడం లేదు. ఎస్సీ కాలనీలో గత 6 నెలల క్రితం కొత్త విద్యుత్ స్తంభాలు వేసినప్పటికీ లైట్లు వెలగకపోవడంతో అవి నిరుపయోగంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో వర్షాలు పడుతుండటంతో పాములు, విష కీటకాలు బయట సంచరిస్తున్నాయని, రాత్రి పూట గడప దాటాలంటే భయపడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఫార్మసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది

మార్కాపురం: విద్యార్థులు భవిష్యత్ అవకాశాలపై దృష్టి సారించి ఆ విధంగా ముందుకు వెళ్లాలని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ హరిబాబు, జార్జి ఫార్మసి కళాశాల సెక్రటరీ డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. పట్టణంలోని జార్జి ఫార్మసి కళాశాలలో 21వ గ్రాడ్యుయేషన్ డేను శుక్రవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలో బాధ్యతాయుత పాత్ర పోషిస్తూ భవిష్యత్ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫార్మసి రంగంలో గ్రాడ్యుయేషన్ తర్వాత వచ్చే ఉద్యోగ అవకాశాలను వివరించారు. కార్యక్రమంలో జార్జి ఫార్మసి కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి

- ఎంపీపీ కామూరి అమూల్య



మాట్లాడుతున్న ఎంపీపీ కామూరి అమూల్య

కొమరోలు: గ్రామాభివృద్ధే లక్ష్యంగా గ్రామ సచివాలయ సిబ్బంది పని చేయాలని ఎంపీపీ కామూరి అమూల్య సూచించారు. కొమరోలులోని వెలుగు కార్యాలయంలో మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా గంగాదేవిపల్లె గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎంపికై రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోటి రూపాయల నజరానాను గెలుపొందిందని, అలా మన గ్రామాలను అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చెన్నారావు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సీపీఐ మహాసభలు విజయవంతం చేయాలి



పట్టణంలో ర్యాలీ నిర్వసిస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: ఈనెల 28వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న రాష్ట్ర సీపీఐ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి అందె నాసరయ్య పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం స్థానిక పూలసుబ్బయ్య భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, మెడికల్ కళాశాలను పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. మార్కాపురం మున్సిపల్ వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి షేక్ ఖాశీం, దుప్పట్ల కాశయ్య, హరిబాబు, యేసు రాజు కోటమ్మ, ఖాశీం తదితరులు పాల్గొన్నారు.